జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎస్.కోట క్రీడాకారిణి నీలిమ ఎంపిక

విశాలాంధ్ర-శృంగవరపుకోట : పట్టణానికి చెందిన బత్తుల నీలిమ జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైందని కోచ్ ఆల్తి తాతబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత సంవత్సరం నవంబర్ నెల 4, 5, 6 తేదీలలో తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో నిర్వహించిన అండర్ 19 స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీలలో విజయనగరం జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించి జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు నీలిమ ఎంపికైందని అన్నారు. ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలోని మండ్యా ప్రాంతంలో నిర్వహించే జాతీయ స్థాయి కబడ్డీ పోటీలలో మన రాష్ట్రం తరపున నీలిమ ఆడుతుందని ఆయన తెలిపారు. జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారిణి నీలిమను విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆదివారం తన నివాసంలో అభినందించారు. జాతీయస్థాయిలో కూడా రాణించి శృంగవరపుకోటకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. నీలిమ ఎంపిక పట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.వి. కృష్ణమూర్తి, సిబ్బంది జాతీయస్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షిస్తూ నీలిమకు ఆర్థిక సాయం అందించారు.

అంగన్వాడీల సమావేశానికి వెళ్తున్న ఏఐటీయూసీ నేత మాణిక్యం, మరో ఐదుగురు అరెస్ట్

విశాలాంధ్ర- శృంగ వరపుకోట : అంగన్వాడీల సమావేశానికి విజయవాడ వెళ్తున్న ఏఐటీయూసీ నేత మద్ది మాణిక్యం, మరో ఐదుగురిని ఎస్.కోట పోలీసులు ఆదివారం సాయంత్రం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, అంగన్వాడీ సంఘ నేతలు పోలీసుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండించారు. పోరాటాలు చేస్తే గాని ప్రభుత్వం స్పందించడం లేదని, మా పోరాటాలను ఇలా పోలీసులు అడ్డుకుంటే మేము ఎలా ఉద్యమాలు చేస్తామని ఆవేదన వ్యక్తంచేశారు. మా న్యాయమైన డిమాండ్లు ఎలా పరిష్కరించుకుంటామో పోలీసులు, ప్రభుత్వ పెద్దలు తెలియజేయాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన అంగన్వాడీల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

బరిలో నిలిచేదెవరు...? గెలిచేదెవరు...?

ఆసక్తికరం... విజయనగర రాజకీయం

విశాలాంధ్ర-విజయనగరం: విజయనగరం నియోజక వర్గ రాజకీయాలు ఆసక్తిరేపుతున్నాయి. అధికార విపక్షాల నుంచి బరిలో దిగేదెవరు? గెలిచేదెవరు? ఎన్నికల వాతావరణం తలపిస్తున్న వేళ ఎన్నో చర్చోపచర్చలు. మరెన్నో ఆసక్తికర విశ్లేషణలు. ప్రధానంగా టీడీపీ నుంచి ఎవరు బరిలోకి దిగుతారనేది ఉత్కంఠ రేపుతోంది. అశోక్ గజపతి రాజు పోటీ చేస్తారా? కుమార్తె అదితి గజపతిరాజుకు అవకాశం కల్పిస్తారా? అనేది రాజకీర వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇక వైసిపి నుంచి కోలగట్ల వీరభద్రస్వామి పేరు ఖరారైనట్లేనని, అధికారికంగా ప్రకటించడమే వుందనీ, ఆయన అనుయాయులు చెపుతున్నారు. ఇరు పార్టీల వారూ ఎవరికి వారే తమ విజయావకాశాలను బేరీజు వేసుకుంటున్నారు. బరిలో అశోక్, ఆయన కుమార్తె ఇరువురిలో ఎవరువుంటే ఎన్నికలలో పోటీ ఎలా వుంటుందనే విషయమై అధికార విపక్షాలలో ఆసక్తికర చర్చ సాగుతోంది.

విజయనగరం ఒకప్పుడు టీడీపీ కి కంచుకోట. సీనియర్ నేత, పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు అశోక్ గజపతి జిల్లాలో తెలుగుదేశం పార్టీకి పర్యాయపదంగా నిలిచారు. తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుంచి విజయనగరం ఎమ్మెల్యే గా అప్రతిహతంగా విజయాలు సాధిస్తూ వచ్చిన అశోక్ గజపతిరాజు 2004లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన కోలగట్ల వీరభద్ర స్వామి చేతిలో ఓటమి చవి చూసారు. తరువాత 2014లో మాత్రం విజయనగరం ఎమ్మెల్యే స్థానానికి టీడీపీ అభ్యర్థి గా మీసాల గీత. పోటీచేసి విజయం సాధించారు. ఆ ఎన్నికలలో అశోక్ గజపతిరాజు విజయనగరం ఎంపిగా విజయం సాధించడంతో పాటు కేంద్ర మంత్రి గా కూడా వ్యవహరించారు. తరువాత 2019లో ఎంపిగా పోటీచేసి ఓటమిచెందారు. అదే ఎన్నికలలో విజయనగరం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి గా అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు పోటీచేసి కోలగట్ల చేతిలో ఓడి పోయారు. అప్పటి ఎన్నికలలో కోలగట్ల వీరభద్ర స్వామికి 6400 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఇక్కడ గమనించాల్సిన మరో అంశమేంటంటే 2019లో జరిగిన త్రిముఖ పోటీలో జనసేన అభ్యర్థి పాలవలస యశస్వి 7190 ఓట్లు సాధించారు. టీడీపీ జనసేన పొత్తు నేపథ్యంలో టీడీపీ నుంచి ఎవరు పోటీ చేసినా జనసేన సహకారం కూడా కలిసి వస్తుందని ఆ పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. అయితే ఈ సారి కూడా అదితి గజపతిరాజు పోటీ చేస్తారని పార్టీ లో ఇప్పటికే టాక్ నడుస్తోంది. పార్టీ కార్యక్రమాలలో ఆమె చురుకుగా పాల్గొంటున్నారు కూడా. మరో వైపు వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి తన గెలుపుపై ధీమాగా వున్నారు. తమ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలతో పాటు నియోజకవర్గంలో తాను చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు కూడా తనకు కలిసి వచ్చే అంశంగా వైసీపీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఏదిఏమైనా విజయనగరం నియోజకవర్గంలో ఈసారి పోటీ రసవత్తరంగా వుంటుందనీ రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

కామ్రేడ్ ఐవి లెనిన్‌కు ఘన నివాళులు

విశాలాంధ్ర-బొబ్బిలి : రష్యా విప్లవ వీరుడు, సోషలిజం విప్లవానికి నాంది పలికిన కామ్రేడ్ ఐ.వి. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా సిపిఐ బొబ్బిలి నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఆదివారం కామ్రేడ్ లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, దళిత హక్కుల పోరాట సమితి నియోజకవర్గం కార్యదర్శి బొద్దాన శ్రీనివాస్ పలువురు సిపిఐ పట్టణ నాయకులు పాల్గొన్నారు.

మానవాళి విముక్తికి మార్గంచూపిన మహా నేత లెనిన్

విజయనగరం టౌన్: విశ్వ మానవాళి విముక్తి కోసం మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని దేశ నిర్దిష్ట పరిస్థితుల కి అమలు చేసి రష్యా లో మొట్ట మొదట దోపిడి లేని కార్మిక రాజ్యం స్థాపించిన మహా నేత లెనిన్ అని ఆయన స్ఫూర్తితోచైనా, క్యూబా వియత్నాంలో విప్లవాలు సాధించిన దేశాలు నేడు ప్రపంచ దేశాల కి ఆదర్శంగా నిలిచాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు అన్నారు. కార్మిక వర్గానికిదోపిడి నుండి విముక్తి కి లెనిన్ ఆచరణలో పెట్టి రష్యాలో సాధించిన విజయం నేడు ప్రపంచానికి స్ఫూర్తి అన్నారు. రాబోయే కాలంలో బారత దేశంలో లేనిన్ స్ఫూర్తి తో కార్మిక, కర్షక ఐక్యతతో సిపిఎం ప్రజా ఉద్య మాలు నిర్మిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి రమణమ్మ, ఏ.జగన్మోహన్, బి రమణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో జోరుగా కులగణన

విశాలాంధ్ర-విజయనగరం: సమాజంలో వివిధ సామాజిక వర్గాల జనాభా, వారి స్థితిగతులను తెలుసుకొని, వారికి మరింత ప్రయోజనం చేకూర్చాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కులగణన ప్రక్రియను శనివారం నుంచీ ప్రారంభించింది. దీనిలో భాగంగా జిల్లాలో తొలిరోజే 99.68 శాతం సచివాలయాల పరిధిలో కులగణన ప్రారంభమయ్యింది. మొత్తం 626 గ్రామ సచివాయలకు గాను మొదటిరోజు 624 సచివాలయాల్లో ఈ ప్రక్రియ నిర్వహించారు. మొత్తం 10,770 క్లష్టర్ల పరిధిలో 6,35,940 ఆవాసాలు ఉండగా, సుమారు 18,31,209 మంది నుంచి వివరాలను సేకరించాల్సి ఉంది. మొదటిరోజు 624 సచివాలయాల పరిధిలోని 8,089 క్లష్టర్లలో సుమారు 80,362 ఇళ్లకు వెళ్లి, 1,73,008 మంది నుంచి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వివరాలను సేకరించారు. కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసుకున్న అనంతరం, ఇకెవైసి ద్వారా వాటిని ధృవీకరిస్తున్నారు. రెండో రోజు ఆదివారం కూడా కుల గణన ప్రక్రియ జిల్లాలో నిరంతరాయంగా కొనసాగింది. ఎప్పటిలాగే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించారు. పట్టణ ప్రాంతంలో కూడా కుల గణన ప్రక్రియ జోరుగా కొనసాగుతోంది. జిల్లా స్థాయిలో కలెక్టర్ నాగలక్ష్మి ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తుండగా, మండలాల్లో ఎంపిడిఓలు క్షేత్రస్థాయిలో గ్రామాల్లోకి వెళ్లి కులగణన ప్రక్రియను పరిశీంచారు. జిల్లా బిసి సంక్షేమాధికారి నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల స్పెషల్ ఆఫీసర్ నిర్మాలాదేవి పర్యవేక్షణలో సచివాలయాల ద్వారా నిరంతరాయంగా కుల గణన జరుగుతోంది. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో, దీనికోసం రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారా వివరాలను నమోదు చేస్తున్నారు. సేకరించిన వివరాలను పూర్తి గోప్యంగా, భద్రంగా ఉంచుతామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రజల సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన స్థితిగతులను తెలుసుకోవడం కోసం కులగణన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ విధాన నిర్ణయాలను రూపొందించడానికి, సంక్షేమ పథకాలను అమలు చేయడానికి ఈ సర్వే వివరాలు దోహదపడతాయి. తద్వారా బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాల వారికి మరింత మేలు జరుగుతుంది. కుల గణన ద్వారా ఆయా వర్గాల అభివృద్ధికి అనుగుణంగా సంక్షేమ పథకాలను అమలు చేయడానికి వీలు కలుగుతుంది. ముఖ్యంగా వివిధ కులాల సామాజిక, ఆర్థిక పరిస్థితులు, వారి విద్య, జనసంఖ్య తెలుసుకొని, వారికి మరిన్ని ప్రయోజనాలను చేకూర్చడానికి ఈ సర్వే ఎంతగానో దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

నేడు మండల వైసీపీ కార్యకర్తల సమావేశం

మండల పార్టీ అధ్యక్షులు జగ్గుబాబు

విశాలాంధ్ర-వేపాడ: మండల కేంద్రమైన వేపాడలో సోమవారం మధ్యాహ్నం 2. గంటలకు స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు మమ్ములూరు జగ్గుబాబు తెలిపారు.వేపాడ చెరుకు కాటా ఆవరణలో నిర్వహించబోయే ఈ కార్యక్రమానికి ఎంపీపీ, జడ్పిటిసి, వివిధ హెూదాలో ఉన్న చైర్మన్లతో పాటు మండలంలోని 29 గ్రామ పంచాయతీల వైసిపి నాయకులు కార్యకర్తలు హాజరై ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మండల వైసీపీ కమిటీల నియమాకాలు పూర్తి

నేడు ప్రమాణ స్వీకారం చేయనున్న 10 కమిటీలు హాజరుకానున్న ఎస్‌కోట, గజపతినగరం ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర-జామి: రానున్న ఎన్నికలలో మరింత సౌలభ్యం కోసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల స్థాయిలో కమిటీలను నియమించింది. మండల వైఎస్ఆర్ పార్టీ తోపాటు అనుభందంగా ఉన్న మరో 9 కమిటీలను ఏర్పాటు చేసింది. ఈమేరకు కమిటీల జాబితా మండలానికి చేరుకున్నాయి. సోమవారం మండలంలోని కుమరాం గ్రామంలోని ఆర్తికళ్యాణమండపంలో మండల వైసీపీ విస్తృత స్థాయి సమావేశం జరగనుంది. ఈసమావేశానికి ఎస్‌కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్యలు హాజరుకానున్నారు. ఈసమావేశంలో భాగంగా నూతనంగా ఎన్నికైన కమిటీలు ప్రమాణస్వీకారం చేస్తారని నేతలు తెలిపారు.

వైసీపీ మండల అధ్యక్షునిగా రవికుమార్..

ఇప్పటి వరకు మండల పగ్గాలు చేపట్టి నడిపించిన గొర్లె రవికుమార్‌ను తిరిగి పార్టీ అధ్యక్షునిగా అధిష్టానం నియమించింది. ఆయనతోపాటు పలువురిని కమిటీలో నియమించింది. ఇక పార్టీకి అనుభంద సంఘాలైన యువజన విభాగంకు కుమరాం సర్పంచ్ ప్రతినిధిగా ఉన్న పిన్నింటి రవికుమార్‌ను నియమించగా, ఎస్సీ సెల్‌కు జామికి చెందిన మడతల సంతోష్‌కుమార్(చిన్ని)ని నియమించారు. అలాగే వికలాంగుల విభాగం, పిఆర్ విభాగం, మహిళా విభాగం, బిసి విభాగం,ప్రచార కమిటీలకు కార్యవర్గాన్ని నియమించారు. వీరంతా కుమరాం సమావేశంలో ప్రమాణస్వీకారం చేయనున్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

గ్రంధాలయ అధికారి సి. హెచ్ కృష్ణమూర్తి

విశాలాంధ్ర-తెర్లాం: తెర్లాం శాఖా గ్రంధాలయంలో ఆదివారం చిన్న తనం నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి అని స్థానిక గ్రంధాలయ అధికారి సి.హెచ్ కృష్ణమూర్తి అన్నారు. గ్రంధాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమం సందర్భంగా చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించడం అయింది. పిల్లల తో కథలు పుస్తకాలు, పురాణ ఇతిహాసాలు గ్రంధాలయం లో ముఖ్య అంశాలను చదివించడం జరిగింది. చిల్డ్రన్స్ క్లబ్ లో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించడం అయింది.

23 న వైఎస్ షర్మిల రాక

విశాలాంధ్ర-విజయనగరం: ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ నెల 23న విజయనగరం రానున్నారనీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి సతీష్ కుమార్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు విజయనగం పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో ఆమె సమావేశ మవుతారని తెలిపారు.. పిసిసి చీఫ్ గా బాధ్యత లు చెపట్టిన తరువాత జిల్లా ల పర్యటనలో భాగంగా ఆమె విజయనగరం వస్తున్నారని సతీష్ కుమార్ తెలిపారు.

ఆడుదాం ఆంధ్ర క్రికెట్ మ్యాచ్ ఫైనల్‌లో షికారుగంజి మోడల్ స్కూల్ విజేత

విశాలాంధ్ర-దత్తిరాజేరు : ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ వి కృష్ణాపురంలో శనివారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్ టోర్నమెంట్ లో షికారుగంజి మోడల్ స్కూల్ విద్యార్థులు విజయం సాధించి విజేతగా నిలిచి నియోజకవర్గ క్రికెట్ టోర్నమెంట్ కి ఎన్నికయ్యారు. వారికి ప్రిన్సిపాల్ జి. ప్రసన్నలక్ష్మి, పిడి రాజేష్ మరియు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేసారు.

ప్రేమజంట ఆత్మహత్య

ఒకరు ట్రైన్ కింద, మరొకరు జలాశయంలో పడి మృతి

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : మండలంలో గల చినమరికి గ్రామానికి చెందిన శ్రావణ్ ట్రైన్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి ప్రేమించి పెద్దలకు చెప్పే ధైర్యం లేక ఎదిరించలేక ఆత్మహత్యలకు పాల్పడ్డారు, చినమరికి గ్రామానికి చెందిన శ్రావణ్ కొమరాడ గ్రామానికి చెందిన పద్మజ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు, పద్మజకు తల్లి తండ్రిలు వేరే వారితో పెళ్లి నిశ్చయించడంతో తీవ్ర మనస్థాపానికి గురైన పద్మజ జలాశయంలో పడి ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న శ్రావణ్ ట్రైన్ కింద పడి చనిపోయాడు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

శంబర జాతరకు ప్రత్యేక బస్సు సర్వీసులు

డిపిటిఓ సుధాకర్



విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం పోలమాంబ శంబర జాతరకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపడం జరుగుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ తెలిపారు.22వ తేదీన పార్వతీపురం డిపో నుంచి శంబరకు ఐదు సర్వీసులు సాలూరు నుంచి పది సర్వీసులు 23వ తేదీ న పార్వతీపురం నుంచి 30 సాలూరు నుంచి 30 పాలకొండ డిపో ద్వారా రాజాం నుంచి 10 ఎస్ కోట డిపో ద్వారా బొబ్బిలి నుంచి పది విజయనగరం డిపో ద్వారా 20 శ్రీకాకుళం 2 డిపో నుంచి బొబ్బిలి శంబరకు కు 15 సర్వీస్ లు 24వ తేదీన పార్వతీపురం డిపో నుంచి 10 సాలూరు డిపో నుంచి పది సర్వీసులు నడపడం జరుగుతుందన్నారు. ఈ సర్వీసులన్ని సాధారణ చార్జీలతో నే నడపడం జరుగుతుందన్నారు. కావున భక్తులు ఈ సౌకర్యం వినియోగించుకొని అమ్మవారిని దర్శించుకొని అమ్మవారి దీవెనలు పొందాలని కోరారు.

నేడు నియోజకవర్గ సన్నాహక సమావేశం

ఎమ్మెల్యే అలజంగి జోగారావు



విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వాన ఈనెల 27వ తేదీన భీమిలిలో తొలి పార్టీ కేడర్ ప్రాంతీయ సమావేశంను ప్రారంభించ నున్న సందర్భంగా వైయస్సార్ కుటుంబాన్ని 2024 ఎన్నికలకు సన్నద్ధం చేస్తూ ముఖ్యమంత్రి ప్రసంగించిన సందర్భంగా ఆ సమావేశంలో పార్వతీపురం నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో వైఎస్ఆర్ కుటుంబ సభ్యులు పాల్గొనేందుకు గాను నేడు స్థానిక పోలీస్ స్టేషన్ రోడ్డు వద్ద గల ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం పరిశీలకులు, జడ్పీ టీసీలు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, పార్టీ అధ్యక్షులు, జేసీ యస్ మండల ఇంచార్జిలు, సర్పంచులు, మండల & సచివాలయం మొబిలైజేషన్ పిటసిలు నామినేటెడ్ చైర్మన్లు, వైస్ చైర్మన్‌లు, డైరెక్టర్లు ఇతర మండల స్థాయి సీనియర్ నాయకులు అందరూ కూడా తప్పక పాల్గొనాలని ఎమ్మెల్యే కోరారు.

లెనిన్ ఆశయ సాధనకు కృషి చేయాలి

కమ్యూనిజానికి బాటలు వేసిన మహానాయకుడు

సిపిఐ మన్యం జిల్లా కార్యదర్శి కూరంగి పిలుపు

విశాలాంధ్ర- బెలగాం: పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఆర్థిక న వా న త్ వం సాధించడానికి సోషలిజం విప్లవానికి నాంది పలికిన వ్లాదిమిర్ లెనిన్ ఆశయాలను సాధించడానికి కృషి చేయాలని సిపిఐ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు పిలుపునిచ్చారు. ఆదివారం రష్యా విప్లవ వీరుడు లెనిన్ శత వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం పార్వతీపురం జిల్లా ఆసుపత్రి వద్ద సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈ.వి నాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మన్మధరావు లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిజానికి బాటలు వేసిన మహానాయకుడు, మహెూన్నతమైన వ్యక్తి లెనిన్ అని, కార్మిక కర్షక హక్కుల కోసం మొట్టమొదటి విప్లవాన్ని సాధించిన మహానాయకుడు లెనిన్ అని అన్నారు. రష్యాలో కార్మిక సంఘాలను ఏర్పాటు చేసి పెట్టుబడుదారి విధానానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప నాయకుడు లెనిన్ అని అన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మూలనకు లెనిన్ చేసిన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కన్వీనర్ ఆర్. కుమార్, ఆసుపత్రి కార్మికుల జిల్లా అధ్యక్షురాలు అలజంగి కుమారమ్మ, ఎఐవైఫ్ జిల్లా అధ్యక్షులు కూరంగి గోపినాయుడు, చేతివృత్తుల సంఘం జిల్లా కార్యదర్శి సింహాద్రి దుర్గారావు, జిల్లా ఆసుపత్రి శానిటేషన్, సెక్యూరిటీ సూపర్ వైజర్లు మౌళి, సుధీర్,వంశీ, సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది ప్రసాద్, దిలీప్, రమేష్, ఈశ్వరరావు, కుమార్, రమా, సత్యవతి, పార్వతమ్మ, అమ్మడమ్మ, తౌడమ్మ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బెలగాం : సిపిఎం పార్టీ జిల్లా కమిటీ, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అధ్యక్షతన పార్వతీపురం సుందరయ్య భవనంలో ప్రపంచంలో మొట్టమొదట కార్మిక రాజ్యాన్ని స్థాపించి తెచ్చిన సోషలిజం నిర్మాత లెనిన్ శత వర్ధంతి సందర్భంగా పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి లెనిన్ చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పించారు. కార్మిక హక్కులు, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం పెంచాలని, రష్యాలో సోషలిజం ఏర్పడిన తర్వాతే అనేక ప్రజారక్షణ హక్కులు చట్టాలు వచ్చాయని దోపిడీదార్లు ఆ రాజ్యాన్ని కూల్చేసిన తర్వాత ఇప్పుడు మరలా కార్మికులకు ప్రజలకి కష్టాలు ప్రారంభమయ్యాయని ఆ పోరాటస్ఫూర్తితో కార్మిక రాజ్యం కోసం అన్ని రంగాలు సంఘాలు పోరాటాలు ఉధృతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వెంకటరమణ, కె. రామస్వామి, గుమ్మలక్ష్మీపురం మండలం ఎంపిటిసి మండంగి రమణ, మండల నాయకులు రాము, సిఐటియు నాయకులు వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లెనిన్‌కు ఘన నివాళులు

గుమ్మలక్ష్మీపురం: స్వాతంత్రంలో పోరాడిన వ్యక్తులు ఎవరని అడిగితే మనం చెప్పే మొదటి నాలుగు పేర్లలో భగత్ సింగ్ ఉంటారు. భగత్ సింగ్ చివరి కోరిక కనీసం ఒక్కసారి లెనిన్ ని చూడడం. అలాంటి గొప్ప వ్యక్తి లెనిన్. లెనిన్ అనే పేరుతో ప్రసిద్ధుడైన రష్యా విప్లవ నాయకుడు, కమ్యూనిస్టు రాజకీయ వేత్త, ఇతను 1917లో జరిగిన అక్టోబర్ విప్లవం ప్రధాన నాయకుడు. రష్యన్ సోవియట్ సోషలిస్ట్ రిపబ్లిక్ దేశానికి మొదటి అధినేత 1922 వరకు ఆ పదవిలో కొనసాగారు. మొదటి ప్రపంచ యుద్ధంలో కార్మికులకు రైతులకు భిన్నజాతులకు కులాలు, మతాలు అతీతంగా నిలబడి పోరాడిన వ్యక్తి లెనిన్. అందరినీ ఐక్యమత్యం పరిచి మొదటి ప్రపంచ యుద్ధం సాధించారు. భూస్వామ్యం, సామ్రాజ్యవాదం, పెట్టుబడి దారి వర్గాలకు వ్యతిరేకంగా నిలబడి హిట్లర్ ప్రభుత్వాన్ని కూల్చివేసిన వ్యక్తి లెనిన్. 1924 జనవరి 21న చనిపోవడం జరిగింది. 2024 జనవరి 21 ఆదివారంకి 100 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఆ సందర్భంగా గుమ్మలక్ష్మీపురం మండలం %+జజ% వద్ద లెనిన్ యొక్క శతవర్ధంతి కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కామ్రేడ్ పువ్వుల ప్రసాదరావు, మండంగి గోపాలరావు, %+జజ% కార్మిక నాయకుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలోకి వలసల జోరు



విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: స్థానిక శాసనసభ్యులు అలజంగి జోగారావు సారథ్యంలో పురపాలక సంఘం కొత్తవలస ప్రాంతం 7వ వార్డు నుంచి గత 40 ఏళ్లుగా టిడిపితో సాన్నిహిత్యం చేస్తూ వస్తున్న నాయకులు బొద్దల కృష్ణ, బాణాల వెంకటి, యలగాడ రాము, బొద్దూరు గంగరాజుతో పాటు 40 కుటుంబాలు నేడు స్థానిక కౌన్సిలర్ బొత్స ఆనంద్ రావు, కో ఆప్షన్ సభ్యులు మెరువ వెంకట్రావు ల ఆధ్వర్యంలో క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు సమక్షంలో ఆయన చేతులమీదుగా పార్టీ కండువా వేసుకొని పార్టీలో చేరడం జరిగినది. క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సాదర స్వాగతం పలుకుతూ మీరందరూ కూడా అధినాయకుడు వైస్ జగన్ పాలనపై నచ్చి, మీరు నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము కాకుండా మీరు నచ్చిన విధంగా మన ప్రభుత్వం పరిపాలన కొనసాగుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని మళ్ళీ రానున్న కాలంలో తప్పక గెలిపించవలసిన బాధ్యత మనందరిపై కలదని అందుకు మీరందరూ కూడా మన వైసీపీ కుటుంభంతో కలిసి పనిచేసి ముందుకు సాగాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, వార్డు కౌన్సిలర్ సభ్యులు రణభేరి చిన్నం నాయుడు, నాయకులు బూరి కృష్ణ, సువ్వాడ శ్రీనివాసరావు, జీ చిరంజీవి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోలమాంబ జాతరకు పటిష్ట బందోబస్తు

ఎస్పీ విక్రాంత్ పాటిల్

విశాలాంధ్ర-పార్వతీపురం: ఉత్తరాంధ్ర గిరిజన ఆరాధ్య దైవంగా భావించే శంబర గ్రామదేవత శ్రీశ్రీశ్రీ పోలమాంబతల్లి జాతరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లాఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. నేటినుంచి మూడు రోజుల పాటు జాతర జరుగుతున్న మంగళవారం జరగనున్న సిరిమానుసంబరంను సజావుగా జరిగేలా పోలీస్ సిబ్బంది పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.సోమవారం ఉదయం శంబర జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటుచేసి తగుసూచనలు జారీ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే జారీచేసిన అదేశాలు మేరకు సిబ్బంది అంతా సోమవారం ఉదయానికి శంబర చేరుకోవాలని తెలిపారు. జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ దిలీప్ కిరణ్ ఆధ్వర్యంలో పార్వతీపురం డి ఎస్పీ సునీల్ సరోస్, దిశ డిఎస్పీ హర్షిత, ఎస్సీ ఎస్టీ సెల్ డి ఎస్పీ మురళీధర్, ఏ ఆర్ డిఎస్పీ శేషాద్రిలు పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. జాతరకు 15మందిసిఐలు, ఆర్ఐలు, 36మంది ఎస్ఐలు, నలుగురు మహిళ ఎస్ఐలు, 88మంది ఏ ఎస్ఐలు, 233మంది పిసిలు, 57మంది మహిళా పిసిలు, 83మంది హెూమ్ గార్డులతోపాటు స్పెషల్ పార్టీ, ఏఆర్, ఏపీఎస్పీ విభాగాల సిబ్బందిని నియమించామని చెప్పారు. శంబర జాతర సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా తగుచర్యలు తీసుకుంటామని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి, జాతర సజావుగా జరిగేలా భక్తజనం, ప్రజలు సహకారాన్ని అందించాలని కోరారు.

పెదంకలంలో మన సీతానగరం - మన జనసేన కార్యక్రమం

విశాలాంధ్ర-సీతానగరం: జనసేన సిద్ధాంతాలను తెలియజేస్తూ మండలంలోని పెదంకలంలో మండల జనసేనటీం ఆధ్వర్యంలో మన సీతానగరం - మన జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. జనసేన కరపత్రాలు పంచి పార్టీ సిద్ధాంతాలను వివరిస్తూ, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్ని వివరించటం జరిగింది. ఈకార్యక్రమంలో ఐటీ కోర్డినేటర్ పైల సత్యన్నారాయణ , సీనియర్ నాయకులు అక్కివరపు మోహనరావు, అల్లు రమేష్, సత్యన్నారాయణ కాల్యంపూడి, జై శంకర్, సాయి కిరణ్ , గణేష్, నాయుడు,సుధీర్లు పాల్గొన్నారు.

బురదగుంటలు.... చిట్టడవులుకావివి సిసి రోడ్లే...

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : మండలంలోగల చినబొండపల్లి గ్రామంలో అడవుల్లాగా.... బురద గంటలుగా ఎక్కడపడితే అక్కడ దర్శనమిస్తున్నా పరిస్థితి కనిపిస్తుంది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామంలో సిసి రోడ్లు పరిస్థితి ఇలాగే ఉంటాయని ఎస్సీ కాలనీ ఇందిరానగర్ మరియు కొండవీదికి మధ్యలో ఉన్న సిసి రోడ్ బురదున్న చెరువును తలపిస్తుందని అక్కడి గ్రామస్తులు చెబుతున్నారు. ఈ వీధిలో కొంతమేర కాలువలు లేని కారణం వల్ల ఉన్న కాలువలో పూడిక తీయకపోవడం వల్ల చుట్టుపక్కల ఉన్న ఇళ్ళ నుండి వాడిక నీరు వచ్చి రోడ్లపై చేరడంతో ఇలా తయారయిందని, దుర్వాసన దోమల బెడదతో భరించలేకపోతున్నామని అంటున్నారు. పక్కనే ఉన్న ఇంకొక సీసీ రోడ్డు పిచ్చి మొక్కలనిండి రోడ్డు పూర్తిగా కనిపించే పరిస్థితే లేదని, కాలువలు రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కలు శుభ్రపరచకపోవడం వల్ల చిట్టడివిలా తయారయిందని వాపోతున్నారు. ముఖ్యంగా రాత్రిపూట పాములు తిరుగుతున్నాయని.. దీంతో భయభ్రాంతులకు గురవుతున్నామని చుట్టుపక్క గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాలువల శుభ్రపరిచి పిచ్చిమొక్కలు తొలగించవలసిందిగా వారంతా కోరుతున్నారు.

సార్వత్రిక ఎన్నికల ప్రచారం ఉత్తరాంధ్ర నుంచే ప్రారంభం : ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర-బొబ్బిలి : ఏప్రిల్ నెలలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సమర శంఖం మోగించే కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉత్తరాంధ్ర నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు.ఆదివారం ఎమ్మెల్యే శంబంగి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో భీమిలిలో జరగనున్న బహిరంగ సభకు బొబ్బిలి నియోజకవర్గ పరిధి లోని ప్రజాప్రతినిధులు,వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు,సోషల్ మీడియా మిత్రులు,వివిధ హోదాలో ఉన్న కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లు సమావేశానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. 2019ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో అమలు చేసి ప్రజల గుండెల్లో స్థానాన్ని సంపాదించుకున్న ఏకైక నాయకుడు సీఎం జగన్మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు. ఏప్రిల్ నెలలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ మన సీఎం జగన్మోహన్ రెడ్డి నే ముఖ్యమంత్రిగా చేసుకునే దిశగా అడుగులు వేయడంలో భాగంగా ఉత్తరాంధ్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలతో ముఖ్యమంత్రి గారు ఈనెల 27న భీమిలిలో ప్రత్యేకంగా సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.గ్రామ వార్డు సభ్యుడు నుంచి నియోజకవర్గ ఎమ్మెల్యే,సమన్వయకర్త ,వివిధ నామినేటెడ్ పదవుల్లో ఉన్న ప్రతి ఒక్కరూ ఈ సభకు హాజరు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళి కృష్ణ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర మాజీ ఎమ్మెల్సీ రామ్మూర్తి జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గ రాజకీయ దురంధరుడు ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర మాజీ ఎమ్మెల్సీ బహదూర్ గానాల రామ్మూర్తి జయంతి ఉత్సవాలను ఘనంగా జరిగాయి. స్థానిక విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కామాక్షమ్మ కళ్యాణ మండపం లో ఆయన 134వ జయంతి ఉత్సవాలను నిర్వహించి రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు, లక్కోజు ఓంకార్ మాట్లాడుతూ ఉమ్మడి మద్రాస్ రాష్ట్రానికి ఎమ్మెల్సీగా సేవలందించి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘాన్ని అభివృద్ధి చేసిన రాజకీయ దురంధరుడు గానాల రామ్మూర్తని అభివర్ణించారు. తమ సంఘాన్ని తమ కులాన్ని బీసీలో చేర్చే విధంగా దేశవ్యాప్తంగా పర్యటించి కులస్తుల స్థితిగతులను ప్రభుత్వానికి తెలియజేసి బీసీ సాధించిన ఘనుడని అభివర్ణించారు. తమ వర్గీయులు రాజకీయాలలో ప్రవేశించేందుకు ఆయన నాటిన బీజాలే కారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బంగారు దేవుడు, లక్కోజు అప్పలాచారి, వరాహ చారి, సోమరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద మహిళలకు ఒక వరం వైఎస్సార్ ఆసరా..

వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కోఆర్డినేటర్ ఆదియ్య

విశాలాంధ్ర-శృంగవరపుకోట: నిరుపేద మహిళలకు ఒక వరం వైఎస్సార్ ఆసరా పథకం అని వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కోఆర్డినేటర్ ఆదియ్య అన్నారు. ఆసరా నవరత్నాల్లో భాగముగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాలుగు విడతలుగా 11-4-2019 సంవత్సరానికి బ్యాంక్ ఋణము సెల్ఫ్ హెల్ప్ గ్రూపులలో ఉన్న రుణ మొత్తంను నుండి నాలుగు విడతలుగా ఆసరా సంఘ సభ్యులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇప్పటికే మూడు విడతలు ఆసరా మొత్తం సంఘ సభ్యులకు ఇవ్వటం జరిగిందని గుర్తుచేశారు. నాలుగో విడత ఆసరా 23-1-2024న ఏపీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభోత్సవం చేస్తారని తెలియజేసారు. దీనికి ముందస్తుగా ప్రీ లాంచ్ కార్యక్రమాలు జరుగుతున్నవన్నారు. జనవరి 17, 18 తేదీల్లో ఎస్.కోట మండలంలో 44 గ్రామ సంఘాలలో 1312 చిన్న సంఘాలకు చెందిన 14255 మందికి ప్రతి సంఘ సభ్యురాలకి ఇంటింటికి వెళ్లి వాలంటీరు వివో ప్రెసిడెంట్, గృహ సారథి వివోఏ ఇంటింటికి వెళ్లి ఆసరా మొత్తము, జీవనోపాధిలు ఆసక్తి ఉన్న వారి నుండి సేకరించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా జనవరి 19, 20వ తేదీలలో 1312 చిన్న సంఘంల వారీగా సంఘ సమావేశాలు పెట్టి ఆసరా మొత్తం ఎంత వచ్చిందో వారికి అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. సంఘానికి వచ్చిన ఆసరా మొత్తం వారి వ్యక్తిగత ఖాతాలకు బదిలీచే యుటకు తీర్మానాలు కూడా సంఘ సమావేశంలో తీసు కోవడం జరుగుతుం దన్నారు. ఈ తీర్మానం కాపీలను బ్యాంకులకు అందచేయడం జరుగుతుందని వెల్లడించారు. నాలుగో విడతలో అనగా జనవరి 21, 22 తేదీలలో గ్రామ సంఘ సమావేశాలు సచివాలయం పరిధిలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీసీలు మూర్తి, అప్పలనాయుడు, రామన్న, ఎర్రి నాయుడు, వివోఏలు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలకు ఆసరాపై సమావేశాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇందులో 44 గ్రామ సంఘాలలో నాలుగవ విడత ఆసరా పొందిన 1312 చిన్న సంఘాలు 14,255 మంది సభ్యులకు వైయస్సార్ ఆసరా పథకంపై వైయస్సార్ కాంతి పథం సిబ్బంది, ఏపిఎం సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతి అవగాహన కల్పించటం, వ్యక్తిగత ఖాతాలకు నగదును బదిలీ చేయుటకు తీర్మానాలను తీసుకోవటము జరిగింది. ఈ పథకం వల్ల గ్రామీణ ప్రాంత నిరుపేద మహిళలందరూ సంతోషంగా సంబరాలు జరుపుకుంటున్నారు. ఎస్.కోట ఏసీ ఆదియ్య పర్యవేక్షణలో ఈ అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నట్టు ఏపీఎం సురేష్ తెలిపారు.

ఐక్యఉద్యమంతో విజయాన్ని సాధిస్తాం

మా మధ్య విచ్చిన్న కుట్రలు ప్రభుత్వం మానుకోవాలి

విశాలాంధ్ర -జామి: అంగన్ వాడీ కార్యకర్తలు, ఆయాలు అంతా కలిసి ఐక్యంగా ఉద్యమించి తమ న్యాయమైన డిమాండ్‌లను సాదించుకుంటామని అంగన్ వాడీ ఉద్యోగుల యూనియన్ నేతలు బి.కనకమహాలక్ష్మి, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, ఆదిలక్ష్మి తదితరులు తెలిపారు. సమ్మెలో భాగంగా మండలకేంద్రమైన జామిలోని తహాశీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న దీక్షాశిబిరంలో ఆదివారం వీరు మాట్లాడుతూ తమ ఉద్యమమం ఉదృతం చేస్తున్న సమయంలో సహించలేకపోతున్న ప్రభుత్వం మామద్య చిచ్చు పెట్టేందుకు అనేక కుట్రలు చేస్తోందన్నారు. దీనిని సమర్ధవంతంగా తిప్పికొట్టడం జరుగుతోందన్నారు. ఇప్పటికే మండలంలో 6సెంటర్లును తెరిచేందుకు ఏర్పాట్లు చేసారని, కానీ ఆయాకేంద్రాల సిబ్బంది తిరిగి మాసమ్మెలో బాగస్వాములయ్యారని, మా ఐక్యపోరాటానికి ప్రభుత్వం దిగి రావాల్సిందేనని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యలపై సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. ఈదీక్షలో సిటు జిల్లా అధ్యక్షుడు కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రామనారాయణంలో ప్రతిఘట్టం కళ్ళకు కట్టినట్లుగా ...

ఆదాయ పన్ను శాఖ జాయింట్ కమిషనర్ అపర్ణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంను విశాఖపట్నం ఆదాయపన్ను శాఖ జాయింట్ కమిషనర్ వి.అపర్ణ సందర్శించారు. ఈ సందర్భంగా రామనారాయణంలో శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ నారాయణ స్వామిని , సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలుచేశారు. రామనారాయణం లో వాతావరణం ఆధ్యాత్మికతను ప్రతిబింబిస్తోందని రామాయణంలో ప్రతి ఘట్టం కళ్ళకు కట్టినట్లుగా ఉందని అన్నారు. ఆమెతోపాటు విశ్రాంత ఆడిట్ అధికారి కంచర్ల రాజేశ్వరరావు, రాధ దంపతులు పాల్గొన్నారు.

అలుపెరుగని పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ : కోలగట్ల, మజ్జి శ్రీను



విశాలాంధ్ర-విజయనగరం టౌన్: దుర్మార్గం నుండి సన్మార్గం వైపు నడిపించేందుకు అలుపెరుగని పోరాటం చేసిన మహాయోధుడు ఛత్రపతి శివాజీ అని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కొనియాడారు. ఆదివారం భావసార్ క్షత్రియ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సిటీ బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటుచేసిన శివాజీ మహారాజ్ నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. సంఘం యొక్క స్తూపాన్ని ప్రారంభించి పతాకాన్ని ఎగరవేశారు. అంతకుముందు బావసార్ క్షత్రియ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో భారీగా ర్యాలీ నిర్వహించారు. శివాజీ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన సమావేశంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ అలుపెరుగని మరాఠా పోరాటయోధుడిగా శివాజీ మహారాజ్ ప్రపంచ ఖ్యాతిని పొందారని అన్నారు. అటువంటి యోధుడి నిలువెత్తు విగ్రహాన్ని బావసార్ క్షత్రియ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. శివాజీ మహారాజ్ పోరాటపటిమలు కథలుగా చెప్పుకుంటున్న వైనాన్ని, ఆయన యొక్క స్ఫూర్తిని భావితరాలకు ఎంతగానో ఉద్యుక్తులను చేసిందని గుర్తు చేశారు. శివాజీ విగ్రహ ఏర్పాటు జిల్లా కేంద్రానికే మంచి గుర్తింపునిస్తుందని అన్నారు. శివాజీ మహారాజ్ కాంశ్య విగ్రహం ఏర్పాటుకావడం గర్వంగా ఉందన్నారు.పట్టణం కార్పొరేషన్ స్థాయికి చేరిన తర్వాత అందుకు తగ్గ ఏర్పాట్లు చేశామన్నారు. దీనివల్లనే ప్రధాన జంక్షన్లను అభివృద్ధి చేస్తూ విగ్రహాలను నెలకొల్పుతున్నామన్నారు. ఈ మధ్య జరిగిన పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవానికి,అలాగే సంక్రాంతికి విచ్చేసిన అనేకమంది ప్రజలు నగర అందాలను చూసి సంతోషాన్ని వ్యక్తం చేశారన్నారు. ప్రజా సహకారంతో అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తూ మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ సిటీ బస్టాండ్ ప్రాంతం జన సమర్థంతో ఎంతో వ్యాపారి కూడలిగా అభివృద్ధి చెందిందన్నారు. అలాంటి కూడలిలో శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. మరాఠా యోధునిగా ఆయన స్ఫూర్తి దశదిశలా వ్యాపించింది అన్నారు. అందులో భాగంగానే నేడు నగరం లో ఆయన నిలువెత్తు కాంశ్య విగ్రహం ఏర్పాటు జరిగిందని గుర్తు చేశా రు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోల గట్ల శ్రావణి, ముచ్చు లయా యాదవ్, వైసీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, బావసార్ క్షత్రియ అసోసియేషన్ అధ్యక్షుడు గోజే శ్రీనివాస్, టి. ఈశ్వరరావు, జడే తులసిరావు,హరీష్ కుమార్, వి. సత్యరాజ్, డాక్టర్ సుమన్ శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

బొడ్డవర సర్పంచ్ మీనా తల్లి గౌరమ్మ గుండెపోటుతో మృతి..

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్.కోట మండలం, బొడ్డవర గ్రామ సర్పంచ్ దేవాపురపు మీనా తల్లి గౌరమ్మ గుండెపోటుతో ఆదివారం ఉదయం మృతి చెందారు. గౌరమ్మ ఆకస్మిక మృతి పట్ల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, వైస్ ఎంపీపీ సుధారాజు దంపతులతో పాటు ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు, బొడ్డవర ఉప సర్పంచ్ ఆడారి అప్పారావు తదితరులు సంతాపం తెలిపారు.

విద్యార్థులకు గ్రూప్ 1, 2 పోటీ పరీక్షలపై పాడేరు డిప్యూటీ కలెక్టర్ సన్యాసిశర్మ అవగాహన

విశాలాంధ్ర-శృంగవరపుకోట : శృంగవరపుకోట శాఖా గ్రంధాలయంలో పాడేరు డిప్యూటీ కలెక్టర్ వేదుల వెంకట సన్యాసి శర్మ గ్రంథాలయంలో గ్రూప్-1, గ్రూప్-2, ఇతర పోటీ పరీక్షలకు సిద్దమవుతున్న విద్యార్థులకు ఆదివారం అవగాహన తరగతులను నిర్వహించారు. డిప్యూటీ కలెక్టర్ శర్మ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు లైబ్రరీలో ఉన్న పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని, అలాగే నిర్దేశించుకున్న వేళల్లో చదువు తప్ప ఇతర వ్యాపకాలను పక్కన పెట్టుకోవాలని సూచించారు. నేను కూడా శృంగవరపుకోట పట్టణానికి చెందిన వ్యక్తినేనని, ఇదే లైబ్రరీలో అత్యధిక సమయం పోటీ పరీక్షలకు చదువుకుని మూడు ఉద్యోగాలు సాధించినట్టు డిప్యూటీ కలెక్టర్ శర్మ తెలిపారు. కాగా ఇటువంటి అవగాహన తరగతులు ఉపయోగ పడతాయని విద్యార్థులు తెలిపారు. విద్యార్థులు, లైబ్రరీయన్ దామోదర శ్రీధర్ పత్రికాపకంగా డిప్యూటీ కలెక్టర్ శర్మకు కృతజ్ఞతలు తెలిపారు.

చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి

ఈ సమాజానికి యువతీ యువకులు ఆదర్శం కావాలి

పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీడిబాబు

విశాలాంధ్ర-సాలూరు టౌన్: యువతి యువకులు చేదు మార్గంలో వెళ్లకుండా నేటి సమాజానికి సందేశాత్మంగా ఇచ్చేలా ఉండాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ జీడి బాబు సూచించారు.ఆదివారం సాలూరు పట్టణం పలు వీధుల్లో, పలు జంక్షన్లో యువతీ,యువకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.డి.బాబు మాట్లాడుతూ యువకులు సారాకి, మద్యానికి,గంజాయికి దూరంగా ఉండాలని తల్లిదండ్రుల ఆశయాలను కొనసాగించాలని బాగా చదువుకోవాలని సూచించారు. ఇటీవల కాలంలో చాలా మంది యువకులు డబ్బుకు ఆశపడి కొంతమంది సారా పెట్టుబడిదారుల వలలో పడి సారానీ అమ్మటం రవాణా చేయడం లాంటివి చేస్తూ పోలీసులకు దొరికిపోయి జైలుకు వెళ్లడం జరిగింది. దీనివలన తల్లిదండ్రులు వారి మీద పెట్టుకున్న ఆశలు, నమ్మకం పోతాయి. బాగా చదువుకోవాలని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలియజేశారు.అలాగే పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పట్టణంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ఎక్కడకక్కడ వాహనాలను తనిఖీ చేస్తూ రికార్డు లేని వారిని, వేగంగా నడుపుతున్న వారిని మరియు మైనర్ పిల్లలు లైసెన్స్ లేకుండా డ్రైవ్ చేస్తున్న వారిని ఆపి అవగాహన చేయడం జరిగింది అన్నారు.కావున భవిష్యత్తులో వాహనదారులు పోలీసులు అడిగిన వెంటనే అన్ని రికార్ట్స్ చూపించాలని లేనియెడల పోలీస్ వారు మీ పైన చట్టప్రకారం కేసులు కడతారని హెచ్చరించడం జరిగింది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసులు బృందం పాల్గొన్నారు.

ధర్మానికి నిలువెత్తు రూపం శ్రీరాముడు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ధర్మానికి నిలువెత్తు రూపం శ్రీరాముడని సంస్కార భారతి విజయనగరం శాఖ ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం అన్నారు. కళల మాధ్యమంగా సమాజ హిత కార్యక్రమాలు చేస్తున్న అఖిల భారతీయ సంస్థ సంస్కార భారతి ఆధ్వర్యంలో అయోధ్యలోని శ్రీరామ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను పురస్కరించుకుని ఆదివారం ఆర్య సోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో భారత మాత పూజా దినోత్సవం కార్యక్రమం జరిగింది. దైవభక్తి , దేశభక్తి నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. భగవతి నృత్య కళామందిర్ విద్యార్థులచే శ్రీరామునికి నృత్య నీరాజనం కార్యక్రమం జరిగింది కవితల పోటీ మరియు చిత్రలేఖనం పోటీల విజేతలకు బహుమతి ప్రధానం జరిగింది .ఈ కార్యక్రమంలో సంస్కార భారతి ప్రతినిధులు సంతోషి, రమణకుమారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



విశాలాంధ్ర- పాచిపెంట: మండలంలో గల పోలీస్‌స్టేషన్ సమీపంలో పాచిపెంటకు చెందిన భవిరెడ్డి పవన్ కుమార్(25) శనివారం సాయంత్రం విజయనగరం నుండి పాచిపెంట వైపు వస్తుండగా మోటార్ బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో తలకు బలమైన గాయం తగిలింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, కుటుంబీకులు భవిరెడ్డి పవన్‌కుమార్‌ను సాలూరుకు తరలించి చికిత్స అందించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యుడు తెలిపారు. పవన్ కుమార్ లాయర్ కోర్సు ఫైనల్ ఇయర్ చదువుతూ సీనియర్ లాయర్ దగ్గర శిక్షణ తీసుకుంటున్నాడని కుటుంబీకులు తెలిపారు. సంక్రాంతి పండుగ నిమిత్తం విజయవాడ నుంచి స్వగ్రామమైన పాచిపెంట చేరుకున్నాడు తన సొంత పనుల నిమిత్తము శనివారం విజయనగరం వెళ్లి తిరిగి వస్తుండగా స్వగ్రామానికి కొద్దీ దూరంలో ఈ సంఘటన జరిగింది ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన పవన్ కుమార్ ను బంధువులు సాలూరు సిహెచ్ సికి తరలిస్తుండగా ప్రాణాలు విడిచాడు.

గ్రామంలో విషాదఛాయలు

పవన్ కుమా ర్ మరణ వార్త విన్న స్వగ్రామమైన పాచిపెంటలో విషాదఛాయలు అలముకున్నాయి. సరదాగా ఉంటూ కలివిడిగా ఉండేవాడిని మరణ వార్త విన్న గ్రామస్తులు ఒక్కసారిగా కన్నీరు మున్నీరయ్యారు మృత్యువు పవన్ కుమార్ ను ఎలా తీసుకెళ్తుందని ఊహించలేకపోయామని కుటుంబీకులు స్నేహితులు బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కుటుంబాన్ని ఆదుకుంటాడు అనుకున్నా చేతికి అందిన కొడుకు తిరిగిలాని లోకాలకు వెళ్లిపోవడంతో తల్లి అన్నపూర్ణ రోదన పలువురిని కంటతడి పెట్టించింది. తండ్రి శ్రీనివాసరావుకు ముగ్గురు కుమారులు కాగా పవన్ కుమార్ రెండోవాడు. శ్రీనివాసరావు తీవ్ర అనారోగ్యంతో విశాఖపట్నం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందు తున్నాడు. తండ్రికి ఆపరేషన్ చేయించి ఇంటికి తీసుకొస్తానని తన తల్లితో చెప్పిన మాటలను తలచుకుంటూ తల్లి అన్నపూర్ణ రోధన పలువురిని కంట తడి పెట్టించింది. విషయం తెలుసుకున్న తండ్రి శ్రీనివాస రావు అనారోగ్యంతో పాచిపెంట చేరుకొని పవన్ కుమార్ మృత దేహం చూసి బోరుణ విలపించాడు. పోలీసులు కేసు నమోదు చేసి పోస్ట్‌మార్టం నిమిత్తం సాలూరు పీహెచ్‌సీకి తరలించారు. శ్రీనివాస రావు వాదార్చడం ఎవరి తరం కాలేదు.స్నేహితులు తన తోటి విద్యార్థులు తరలివచ్చి పవన్ కుమార్ కు శ్రద్ధాంజలి ఘటించారు. దర్యాప్తు నిర్వహిస్తున్నట్టు పాచిపెంట ఎస్ఐ నారాయణరావు తెలిపారు.

అయోధ్య బాలరాముడు ప్రాణ ప్రతిష్ట కు వెంకట బైరపురంలో సాయి తప్పిట గుళ్ళ బృందం



విశాలాంధ్ర-మక్కువ : శ్రీ రాముడు జన్మభూమి అయోధ్య బాల రాముడు ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా ఈ నెల 18 నుండి 22-01-2024 వరకూ శ్రీ సాయి తప్పుడు గుళ్ళ బృందం వెంకటభరిపురం గ్రామంలోప్రదర్శన జరిపించుకు ప్రాధాన్యత లభించింది. దీంతో స్థానిక వెంకటపురం గ్రామపంచాయతీలో సర్పంచ్ వెంకటరత్నం హర్షం వ్యక్తం చేశారు. శ్రీ సాయి తప్పిట గుళ్ళు బృందం వారిచే వెంకట బైరి పురం గ్రామంలో అల్లు వెంకటరమణ (చంటి గురువు) తప్పిట గుళ్ళు బృందం వారిచే ప్రదర్శిస్తున్నారు.

కోడిపందాలు నిర్వహిస్తే చర్యలు తప్పవు

ఎస్ఐ జ్ఞాన ప్రసాద్

విశాలాంధ్ర:-రామభద్రపురం: మండలం లో కోడిపందాలు, పేకాట ఎవరైనా నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని స్థానిక ఎస్సై జ్ఞానప్రసాద్ అన్నారు.ఆదివారం కోటశిర్లాం గ్రామ సమీపంలో ఉన్న కల్లాలు వద్ద కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బంది తో కలసి దాడి చేశామన్నారు.ఈ దాడులలో ఇద్దరు వ్యక్తులను,రెండు కోడిపుంజులను,రూ..530 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడితూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడిపందేలు నిర్వహించడం,పేకాట ఆడటం చట్టరీత్యా నేరమన్నారు.ఎవరైనా నిర్వహించినట్లయితే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమం లో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ పరీక్ష నిర్వహణ ఆరోపణలపై డిప్యూటీ డిఇఓ దర్యాప్తు...

విశాలాంధ్ర-కురుపాం: నవోదయ పరీక్ష మాల్ ప్రాక్టీస్ జరిగిందంటూ ఆరోపణలు" అనే కథనంపై జిల్లా విద్యాశాఖ అధికారి దర్యాప్తు నిశితంగా చేపట్టాలని ఆదేశించారు. ఆదివారం పాలకొండ డిప్యూటీ డిఇఓ క్రిష్ణ మూర్తి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నవోదయ పరీక్ష కేంద్రంలో సమగ్ర దర్యాప్తు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు చేసిన ఆరోపణలు పై పరీక్ష కేంద్రం , డిపార్ట్మెంట్ అధికారి , చీఫ్ ఎక్జామినర్ , ఇన్విజిలేటర్ లు ,ఎంఎస్ఎస్ లో నుంచి వివరణ లు సేకరించారు.ధర్యాప్తు నివేదిక జిల్లా విద్యాశాఖ అధికారి కి అందజేస్తామని తెలిపారు. కురుపాం జియ్యమ్మ వలస మండలాల్లో మూడు ప్రైవేటు నవోదయ కోచింగ్ సెంటర్లు మధ్య నెలకొన్న విభేదాలు ఈ ఆరోపణలు కు ప్రధాన కారణం అని తెలుస్తోంది.శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో కొందరు సృష్టించిన ఆరోపణ లు ను కురుపాం మండలం పరిషత్ కంప్యూటర్ ఆపరేటర్ వెనకనుండి నడిపించాలని దానికి కురుపాం లో ఓ ప్రైవేట్ పాఠశాల ,పెదమేరంగి జంక్షన్ కు ఆనుకుని ఉన్న మరో ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు సూత్రధారులుగా తెలుస్తోంది. నవోదయ కోచింగ్ ఆశను గ్రామీణ ప్రాంతాల్లో చూపించి పిల్లలు సేకరణ చేసే మూడు పాఠశాల లు పాత్ర ఈ గొడవ కు ప్రధాన కారణం అనేది విశ్వసనీయ సమాచారం. ప్రతి ఏటా ఈ తరహా ఆరోపణలు చేసే ఈ ప్రైవేటు పాఠశాల లు పై జిల్లా విద్యాశాఖ అధికారి ఏ చర్యలు చేపడతారో వేచి చూడాల్సిందే.

త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ - జనసేన కూటమి విజయం తథ్యం

టీడీపీ జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున

విశాలాంధ్ర-గుర్ల :మండలం తాతావారి కిట్టలి గ్రామం నుంచి పలు కుటుంబాలు నాగార్జున సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వీరందరికీ పార్టీ కండువా కప్పి ఆహ్వానం పలికిన ఆయన.. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓటమే లక్ష్యంగా పని చేయాలని, అందుకు ఇప్పటినుంచే సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక దోచుకోవడం, దాచుకోవడం తప్ప అభివృద్ధి ఎక్కడా రావడం లేదన్నారు. అప్పుల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా తీసుకువెళ్లారని విమర్శించారు. సొంత పార్టీ నేతలే జగన్ తీరుతో విసిగిపోయి వైసీపీని వీడుతున్నారని గుర్తు చేశారు. అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని నమ్మి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చంద్రబాబుకు మద్దతు పలుకుతున్నారని తెలిపారు. ఎన్నికలకు పార్టీ శ్రేణులు అంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పార్టీలో పలువురు వార్డు మెంబర్లు రాగోలు గౌరి నాయుడు,ఇజ్జురోతు రమణ, పాంద్రంకి సూర్యకాంతం, గడి సూరి నాయుడు,మామిడి మాలచ్చమ్మ, రెడ్డి లక్ష్మ నాయుడు, మామిడి సాంబ, రాగోలు సీతం నాయుడు, రాగోలు లక్ష్మ నాయుడు, రాగోలు అప్పలనాయుడు, రాగోలు సత్యం, పాంద్రంకి లక్ష్మ నాయుడు, గడి రామ్మూర్తి, ఇజ్జురోతు సత్తిరాము, గేదెల గౌరి నాయుడు, గేదెల రాము నాయుడు, గేదెల అప్పలస్వామి, పైల అప్పల నాయుడు, రాగోలు లక్ష్మ%శీ%, కీర్తి అప్పల నరసమ్మ, రాగోలు కుమార్, రాగోలు సన్యాసమ్మ, గేదెల రాము నాయుడు, రాగోలు కృష్ణ, రాగోలు రాము నాయుడు (గొల్ల),రాగోలు చిరంజీవి, మామిడి గౌరి, పైల భాస్కర రావు, గేదెల తవుడు, గుషిడి సత్తి రాము, జంప శ్రీను,రాగోలు సత్యవమ్మ, ముల్లు రమణ తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెన్నె సన్యాసి నాయుడు, తిరుమలరాజు కిరణ్ కుమార్ రాజు, చనమల మహేశ్వర రావు, మామిడి సూర్యారావు, పిళ్ళా అప్పలనాయుడు, సంచాన సన్యాసి నాయుడు,కర్రోతు గోవింద,గొర్లె రాము నాయుడు, మండల అప్పల నాయుడు,శ్రీను, సూర్యారావు, నారాయణ రావు, పైడినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నెరవేరిన మోసూరు-తాడూరు గ్రామస్తుల చిరకాల వాంఛ

విశాలాంధ్ర - పాచిపెంట : పాచిపెంట మండలంలో మారు మూల గ్రామాల చిరకాల వాంఛ నెరవేరింది. దీర్ఘకాలంగా ఎదురు చూసిన రహదారులు వచ్చాయి. అయితే వంతెనలు లేకపోవడం వలన దూర ప్రాంతాల ప్రజలు కొంత ఇబ్బందులకు గురి అయ్యారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర వారి ఇబ్బందులు తొలగిస్తామని మాట ఇవ్వడం దానిని వాస్తవ రూపంలోకి తీసుకువచ్చారు. పాచిపెంట మండలం మాతమూరు నుండి తాడూరు వరకు వెళ్ళే రహదారిలో రూ.9.80 కోట్లు, మోసురు గ్రామానికి వెళ్లే రహదారిలో రూ.7.60 కోట్లుతో నిర్మించిన వంతెనలను ఆదివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర ప్రారంభించి ఆయా గ్రామస్తులకు అంకితం ఇచ్చారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న డిప్యూటీ సీఎం రాజన్నదొరకు మేళా వాయిద్యాల నడుమ మోసూరు గ్రామస్తులు పల్లకిలో ఊరేగించారు. వంతెన నిర్మాణం పూర్తి అగుటకు కృషి చేసిన రాజన్నదొరకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రజలందరికీ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎంతో మేలు చేసిందన్నారు. ముఖ్య మంత్రికి గిరిజనుల పట్ల ఎంతో అభిమానం అన్నారు. గిరిజనుల అభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమం దిశగా పనిచేస్తూ ప్రతీ ఒక్కరూ చదవాలని అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన., ఇళ్ల లబ్ధిదారులకు వడ్డీ రాయితీ, తదితర పథకాలు అమలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మారు మూల ప్రాంతాలకు సైతం రహదారి సౌకర్యం కల్పించాలని కృషి చేస్తున్నామని తెలిపారు. గిరిజనులు సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ప్రగతి పథంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి డా ఎం వి ఆర్ కృష్ణా జి, పాచిపెంట మండలం ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బస్సులు కిటకిట

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : సంక్రాంతి సెలవులు కావడంతో సుదూర ప్రాంతాల నుండి తమ స్వగ్రామాలకు విచ్చేసి నేటి నుండి పాఠశాలలు కళాశాలలు ప్రారంభం కావడంతో ఆదివారం ఆర్టీసీ కాంప్లెక్స్ రద్దీగా మారింది అందులో రాయగడ సింగపూర్ రోడ్డు వద్ద మూడవ రైల్వే పనులు కావడంతో విజయనగరం మీదుగా వెళ్లే రైళ్లు రద్దు కావడంతో వాటిలో వెళ్లే వారంతా బస్సులు ఆశ్రయించికి తప్పలేదు దీంతో బస్సులు కిటకిటలాడాయి. అందులో విశాఖపట్నం పార్వతీపురం సాలూరు తదితర ప్రాంతాలలోకి వెళ్లే ప్లాట్ ఫారాల వద్ద ఇసుకేస్తే ఇసుక రాలనంత జనాలు కనబడ్డారు. ఆర్టీసీ అధికారులు విశాఖపట్నంకు 20 ప్రత్యేక సర్వీసులను నడిపినప్పటికీ జనాల సంఖ్య తగ్గలేదు. ఉదయం కాంప్లెక్స్ అంతా సాధారణంగా ఉన్న మధ్యాహ్నం మూడు గంటల నుండి సుమారు రాత్రి 8 గంటల వరకు ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణమంతా రద్దీగా కనబడింది. ముఖ్యంగా ఉద్యోగాలు, చదువులు రీత్యా పలువురు ఆయా ప్రాంతాల్లో ఉన్న వారంతా తమ స్వగృహాలకు వచ్చి తిరిగి ప్రయాణం కావడంతో కాంప్లెక్స్ కిటకిటలాడింది. ఆర్టీసీ ప్రాంగణమంతా రద్దీగా ఉండడంతో పలువురు ప్రయాణీకులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు దీంతో ప్రైవేటు వాహనదారులు ధరల సంఖ్య గణనీయంగా పెంచేశారు తప్పని పరిస్థితుల్లో గమ్యస్థానాలకు చేరేందుకు ప్రజలంతా నానా అవస్థలు పడి ప్రయాణం చేశారు.

నేడు శ్రీరామవిగ్రహ ప్రాణప్రతిష్ట కోసం ఎదురు చూపులు

వాడవాడలా శ్రీరామాలయాల్లో, శ్రీఆంజనేయస్వామి ఆలయాల్లో ఏర్పాట్లు

విశాలాంధ్ర - సీతానగరం : ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న రోజు రానే వచ్చింది.అంతా నేడు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్యలో మధ్యహ్నం 12 గంటల 29 నిమిషాలకు (84 సెకండ్లు పాటు) జరగనున్న శ్రీరామ విగ్రహప్రాణ ప్రతిష్ఠకోసం ఎదురు చూస్తున్నారు.దేశ వ్యాప్తంగా వాడ వాడలా మందిర ప్రతిష్ఠ కార్యక్రమాలను ఆయా గ్రామాలలో గల శ్రీరామాలయాల్లో, శ్రీఆంజేయనేయస్వామి ఆలయాల్లో చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.నేడు జై శ్రీరామ్ అంటూ కాషాయ జెండాలు పట్టుకుని వాడవాడలా శ్రీరామ నామాన్ని స్మరించడానికి సిద్ధంగా ఉన్నారు. వాడ వాడలా పూజలు భజనలు కీర్తనలు పాటలు అయ్యాక అన్న సంతర్పణ కార్యక్రమాలను కూడా నిర్వహించేదుకు ఏర్పాట్లు చేశారు.ఇదిలా ఉండగా మండల కేంద్రంలో శ్రీవేణుగోపాల స్వామిఆలయం శ్రీలక్ష్మి నరసింహ ఆలయాల నుంచి ప్రదాన కూడలి వద్ద ఉన్న శ్రీహనుమాన్ దేవాలయం వరకు శోభాయాత్ర నిర్వహించేందుకు పుర ప్రముఖులు,కమిటీ సభ్యులు,భక్తులు,స్వాములు, ప్రజలు అన్ని ఏర్పాట్లు చేశారు.శ్రీరామ పట్టాభిషేకంపటాన్ని రథంపై మేల తాళాలతో,భజనలతో, ప్రార్థనలతో జై శ్రీరామ్ అంటూ ఊరేగిస్తూ యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు .అనంతరం హనుమాన్ దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ట కార్యక్రమం అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేయడం జరుగుతుందన్నారు. శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట సమయంలో అయోధ్య వెళ్లని వారంతా" శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే - సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే " మంత్రాన్ని ఉచ్చరిస్తే అందరికీ మంచి జరుగుతుందని పండితులు తెలిపారు. జై శ్రీరామ్ అంటూ ఈ మంత్రాన్ని ఉచ్చరించి కలియుగంలో మోక్షాన్ని పొందగలరు.

ఎస్ఈబి సిఐగా జోగమ్మ...

విశాలాంధ్ర - కురుపాం : కురుపాం ఎస్.ఈ.బి నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ (సిఐ) గా ఆదివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించిన డి.సి.హెచ్. జోగమ్మ. గతంలో అనకాపల్లి జిల్లా చోడవరం ఎస్.ఈ.బి. సర్కిల్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహించి బదిలీపై కురుపాం వచ్చిన జోగమ్మ ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్రమంగా నాటు సారా, మద్యం తరలించినా, తయారు చేసిన, అమ్మకాలు చేపట్టిన సంబంధించిన వ్యక్తులు పై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పలు రైళ్లు రద్దు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : రాయగడ వద్ద సింగపూర్ రోడ్డు వద్ద మూడవ లైను అభివృద్ధి పనుల్లో భాగంగా ఈస్ట్ కోస్ట్ పరిధిలో విజయనగరం జిల్లా మీదుగా వెళ్లే 08503,04 విశాఖ- భవాని,08527,28 విశాఖ -రాయపూర్,08545,46 కోరాపుట్ -విశాఖ,08511,12 కోరాపుట్ విశాఖ ఇంటర్ సిటీ రద్దు కాగా 12843,44 పూరి- అహ్మదాబాద్,17481,82 బిలాస్పూర్ తిరుపతి,22973,74 పూరి -గాంధీ ధామ్ తో పాటు మరికొన్ని రైళ్లను సంబల్పూర్ టిట్లగర్ మీదుగా దారి మరల్చినట్లు రైల్వే అధికారులు తెలియజేశారు. దీనివల్ల పార్వతీపురం, సాలూరు, బొబ్బిలి తదితర ప్రాంతాల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. రైళ్లు రద్దు కావడం వల్ల ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఈనెల 28 వరకు రైల్వే పనులు జరుగుతాయని దీనిని ప్రయాణికులంతా గుర్తించాలని విజయనగరం స్టేషన్ మేనేజర్ కె మురళీకృష్ణ తెలిపారు.

అరకులో చంద్రబాబును కలిసిన టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ కోళ్ల లలితకుమారి

విశాలాంధ్ర - శృంగవరపుకోట : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుని అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు మండలం, డుంబ్రిగుడ సంత వద్ద జరిగిన "రా కదలి రా" బహిరంగ సభలో టీడీపీ ఎస్.కోట నియోజకవర్గ ఇంచార్జ్ కోళ్ల లలితకుమారి మర్యాద పూర్వకంగా కలిసినట్టు పార్టీ శ్రేణులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కోళ్ల లలిత కుమారి చంద్రబాబుకి పుష్పగుచ్చం ఇచ్చి అభినందలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శృంగవరపు కోట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ ఒబ్బిన సత్యనారాయణ (సత్తిబాబు), రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో యువత, మహిళలు పాల్గొన్నారు.

ఆదివాసీలంతా అభిప్రాయాలను తెలియజేయండి : కోలక లక్ష్మణమూర్తి

విశాలాంధ్ర - బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజనులంతా ఆదివాసీ గొంతుక ద్వారా తమ అభిప్రాయాలు తెలియజేయాలని కురుపాం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కోలక లక్ష్మణమూర్తి తెలిపారు. ఆదివారం పార్వతీపురం గిరిజన భవన్ లో ఆదివాసీ గొంతుక ప్రజాభిప్రాయ సేకరణ పోస్టర్ ను ఐక్య వేదిక నాయ కులు పాలక క్రాంతికుమార్ తో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా గిరిజనులు పాలక వర్గాల దోపిడీకి, మోసానికి గురౌతున్నారన్నారు. వసతులు లేకున్నా, అభివృద్ధి చేయకున్నా అమాయకత్వంతో తరచూ నాయకుల కుట్రలకు బలౌతున్నారన్నారు. గిరిజన ప్రజానీకంలో చైతన్యం లేకపోవడం ఇందుకు కారణమన్నారు. ముఖ్యంగా గిరిజన హక్కుల రక్షణకు జరిగే ఉద్యమాల్లో చదువుకున్న యువత, ఉద్యోగ ఉపాధ్యాయులు భాగం కావాలన్నారు. ఇందుకోసం నూతన కార్యాచరణ రూపొందించడం జరుగు తుందని, గిరిజన క్షేమం కోరుకునే ప్రతి గిరిజనుడు బాధ్యతగా ఆదివాసీ గొంతుక ప్రజాభిప్రాయ సేకరణలో భాగమై తమ అభిప్రాయాలను వ్యక్త పరచాలని తెలిపారు. అభిప్రాయాల నమోదు కొరకు %https://shorturl.at/ayG%67 లింక్ను ఉపయోగించాలన్నారు. మరిన్ని వివరాల కొరకు, దరఖాస్తు కొరకు 9014875313 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లిపురం జగదీష్, మండంగి రమణ, రామస్వామి, నాగేశ్వరావు, భగవాన్ పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు

మాజీ ఎమ్మెల్సీ జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు వెల్లడి

విశాలాంధ్ర - సీతానగరం : టీడీపి అదినేత చంద్రబాబునాయుడు హయాంలోను టీడీపీ ప్రభుత్వంలోనే నియోజక వర్గంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను పెద్ద ఎత్తున అమలుజరిగాయని మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు తెలిపారు.ఆదివారం మండలంలోని పెదభోగిలి మాజీ సర్పంచ్ బుడితి శ్రీను, చినబోగిలి మాజీ సర్పంచ్ సబ్బాన జగన్నాధంల కుటుంబాల పరామర్శతో పాటు పార్వతిపురం మున్సిపాలిటీ మాజీకౌన్సిలర్ తెర్లిసత్యనారాయణ కుటుంబంలో జరిగినశుభ కార్యంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు.రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం తధ్యమని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమని తెలిపారు.వైఎస్సార్సీపీ ప్రభుత్వం అన్ని విధాలా వైఫల్యం చెందినట్లు తెలిపారు.గడచిన నాలుగున్నరేల్లలో జరిగిన అభివృద్ధి ఎక్కడని ప్రశ్నించారు. ప్రజలు ఎన్నికలు ఎప్పుడు వస్తాయనిఎదురుచూస్తున్నారన్నారు.వారితో పాటు సీతానగరం, పార్వతీపురం పట్టణ అధ్యక్షులు కొల్లి తిరుపతిరావు, గుంట్రెడ్డి రవికుమార్, పార్వతీపురం లయన్స్ క్లబ్ అధ్యక్షులు దొగ్గ మోహనరావు, టీడీపినాయకులు కెంగువ ప్రదీప్,బడే గౌరునాయుడు, మరిశర్ల కార్తీక్, జగన్, రవికుమార్, జాగాన ధనుంజయనాయుడు, పాలకొండ రాజశేఖర్, సబ్బాన జగన్నాధం, మర్రాపు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన మండల పార్టీ కార్యాలయం ప్రారంభించిన లోకం మాధవి

విశాలాంధ్ర - పూసపాటిరేగ : మండలం పూసపాటి రేగ గ్రామంలో జనసేన పార్టీ నూతన కార్యాలయంను నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్చార్జ్ లోకం మాధవి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నాలుగు మండలాల జనసేన సీనియర్ నాయకులు మండల అధ్యక్షులు వీర మహిళలు మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పూసపాటిరేగ జంక్షన్ నుంచి ర్యాలీగా సుమారు 500 మంది ప్రజలతో శ్రీమతి లోకం మాధవి హారతులు మరియు పూలమాలలతో ఆహ్వానం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పూసపాటిరేగలో కార్యాలయం ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని, మండల కార్యవర్గ సమావేశాలు నూతనంగా ప్రారంభించిన కార్యాలయంలోని ఏర్పాటు చేస్తామని కార్యకర్తలకు వీర మహిళలకు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వ పాలన గురించి మాట్లాడుతూ 2019లో మహిళలను యువతను మాయమాటలు చెప్పి నమ్మించి జగన్ అధికారంలోకి వచ్చాడని వచ్చిన తర్వాత వైసీపీ కార్యకర్తలను వాలంటీర్లుగా పెట్టుకొని ఇప్పుడు రకరకాల పనులకు వారిని వినియోగించి మోసం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. మద్యపాన నిషేధం పేరు చెప్పి మహిళలకు మోసం చేసి కల్తీ మద్యన అంటగట్టి ప్రజల్ని దగ్గర డబ్బులు దోచేస్తున్నారని తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో జనసేన టిడిపి ప్రభుత్వ స్థాపనకు తమకు పూర్తి మద్దతు తెలియజేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ లోకం మాధవి తోపాటు జనసేన మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీశ్రీశ్రీ పోలమాంబ జాతర మహోత్సవాలు

నేడు తోలేళ్ళ ఉత్సవంతో శంబర జాతర ప్రారంభం

పదివారాలపాటు జరగనున్న శంబర పోలమాంబ జాతర

జాతరకు అన్నిశాఖల ఆద్వర్యంలో ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర - పార్వతీపురం/ముక్కువ : ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, గిరిజనుల ఆరాధ్య దైవం, సిరులతల్లి, చల్లని తల్లి,నిదర్శనం కలిగిన తల్లి, భక్తుల కోర్కెలు తీర్చే తల్లి,ఆంధ్ర,తెలంగాణ,ఒడిశా, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాల ప్రజల ఆరాధ్య దైవంగా భావించే శంబర గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ పోలమాంబ జాతర సోమవారం నుంచి వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నేడు తోలేళ్ళఉత్సవంతో జాతర ప్రారంభం జరుగుతుంది. మంగళవారం జాతరలో ప్రధానమైన సిరిమాను సంబరంకు లక్షమందిక పైగా భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని వెళ్లడం జాతర ప్రత్యేకతని చెప్ప వచ్చును. ఉత్తరాంధ్రలో పైడితల్లి జాతర, పోలమాంబ జాతరలు ప్రత్యేక జాతరలన్న సంగతి అందరికి తెలిసిందే. శ్రీ పోలమాంబ అమ్మవారి జాతర సందర్భంగా శ్రీఅమ్మవారి ఉత్సవములు సోమవారం తోలేళ్ళఉత్సవముతో ప్రారంభమై, మంగళవారం సిరిమానోత్సవం ,బుధవారం అనుపోత్సవాలు జరుగుతాయి. సిరుల తల్లిగా ప్రసిద్ధి చెందిన చల్లని తల్లి, నిదర్శనమైన తల్లి భక్తుల కోరికలు తీర్చే కల్పవల్లి శ్రీ శంబర పోలమాంబ అమ్మవారి జాతర10 మంగళ వారములు ఉంటాయని, మొదటివారం రాని భక్తులు మిగిలిన తొమ్మిది వారాలు శ్రీఅమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని శ్రీ అమ్మవారి కృపాకటాక్షములు పొందగలరని కమిటీ సభ్యులు తెలిపారు.

2వమంగళవారం తేదీ 30-01-2024
3వమంగళవారం తేది 06-02-2024,
4వమంగళవారం తేదీ 13-02-2024,
5వమంగళవారం తేది 20-02-2024,
6వమంగళవారం తేది 27-02-2024,
7వమంగళవారం తేదీ 05-03-2024,
8వమంగళవారం తేదీ 12-03-2024,
9వమంగళవారం తేది 19-03-2024,
10వమంగళవారం తేది 26-03-2024లలో భక్తులు చదురుగుడి, వనంగుడిలలో శ్రీఅమ్మవారిని దర్శించి, మ్రొక్కులను తీర్చుకొని తరించ గలరన్నారు. పైఉత్సవములలో సంగీత, సాహిత్య, నృత్య కార్యక్రమములు జరుపబడునని పులి వేషాలు, తప్పెటగుళ్ళు, కోలాటములు, ధింసా నృత్యములు వంటి కార్యక్రమములు జరుగునని కమిటీ సభ్యులు తెలిపారు.

పార్వతీపురం మన్యంజిల్లా లోని సాలూరు పట్టణమునకు 18 కి.మీ. దూరంలో, మక్కువ గ్రామంనుండి 6కి.మీ. దూరంలో శంబర గ్రామం వద్ద పవిత్ర గోముఖీనదీ తీరాన స్వయంసిద్ధంగా భక్తుల అభీష్టములు తీర్చుటకు శ్రీపోలమాంబ అమ్మవారు సుమారుగా నేటికి మూడువందల సంవత్సరముల క్రిందట ఉద్భవించినది ఇలాఉద్భవించిన శ్రీపోలమాంబ అమ్మవారు ఉత్తరాంధ్ర గిరిజనుల ఆరాధ్య దైవముగా కొలువైయున్నది. విజయనగరం శ్రీ పైడిమాంబ అమ్మవారి జాతర తరువాత శంబర పోలమాంబ అమ్మవారి జాతరే ప్రాముఖ్యత చెందినది. ఈమె కొండదొరలకు పార్వతీదేవివలె భాసించుచున్నది. ఈమె జన్మించిన లగాయతూ వారి ఇంటిలో కొన్ని మహత్తర సంఘటనలు జరిగినందు వలన, అప్పటికే వివిధ ప్రాంతవాసులు ఈమె మహాశక్తిని గ్రహించి, కోరిన కోర్కెలు తీర్చు కల్పవల్లిగా అవతరించిన కన్యాకాపరమేశ్వరిగా పేరుగాంచెను.ఈమె శక్తిననుసరించి మహాభక్తులు జాతి, మత భేదములు లేకుండా ఆరాధ్య దైవముగా ఆదరించి సుఖసంతోషములతో వర్ధిల్లిరి. ఈమెకు యుక్త వయస్సు వచ్చిన తదుపరి తల్లిదండ్రుల కోర్కె మేరకు వివాహసంబంధం వెతుకు సందర్భములో ఈమె ముత్తదువులచే పుస్తె కట్టించుకొనుట, పెళ్ళితదుపరి అత్తగారి గ్రామమైన మోఖాసా మామిడిపల్లి గ్రామానికి సారె, చీరల సామాగ్రితో ప్రయాణమగు సందర్భములో మార్గమధ్యమున గులివింద పోతునాయుని చెఱువువద్ద తనను అనుసరించి, తన బాగోగులు చూస్తూయున్న తనమేనత్తతో "భూ" సమాధి అయినది. అప్పటి నుండి ఆమెశక్తితో వివిధ ప్రాంతవాసులు, వివిధ కుల,మతాలవారు దేవతగా ఆరాధించుచున్నారు. వివిధప్రాంతాలలో కఠిన కరువుతో మసూచితో అనేక ఈతిబాధలతో ప్రజలు బాధపడు సందర్భమున వివిధ భక్తుల స్వప్నములో కనిపించి ఆమెకు కావలసిన విషయములు చెప్పి అంతర్ధాన మయ్యెను. ఆమెయొక్క మహిమాన్వితాలు గుర్తించి ఈమెకు మనస్ఫూర్తిగా జాతర ఉత్సవాలు జరిపించగా కరువు, మసూచికము, ఈతి బాధలు లేకుండా సకల ఐశ్వర్యములతో, సుఖ సంతోష ములతో ప్రజలు అభివృద్ధి చెందియున్నారు. తమ మేనత్త పెద్ద పోలమాంబగాను,తాను పెండ్లి పోలమ్మ గాను అవతరించి తనను ఎవరైతే భక్తి శ్రద్ధలతో కొలుచుదురో వారి కోర్కెలు నెరవేర్చుటకు ఉత్పన్నమై కాపాడుచుండునని, తామిరువురుకు

గుడులు, నిర్మాణస్థల నిర్ణయములతో చెప్పుట వలన గ్రామస్థులు మరియు భక్తులు పెద్దమ్మవారు, పోలమ్మవారు అని కొలుచుచుండెదరు. అప్పటి నుండి భక్తులకు చల్లనితల్లిగా కోరిన కోరికలు తీర్చే వరప్రదాయని గాను. నిదర్శనమైన తల్లి గాను ప్రసిద్ధిచెందినది.

దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి:
శంబర జాతరకు ముమ్మరంగా ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఈవో వివి సూర్యనారాయణ తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ప్రధాన జాతరగా, రాష్ట్ర గిరిజన దేవత పండగగా ఈ ఏడాది నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. లక్షలాదిగా వచ్చే భక్తులకు ఇబ్బందుల్లేకుండా అన్ని శాఖల సమన్వయంతో నిర్వహిస్తామన్నారు.

విధినిర్వహణకు 100 మంది :
ప్రస్తుతం వనంగుడి, చదురుగుడి ఆలయాల వద్ద క్యూలైన్ల ఏర్పాటు దాదాపు పూర్తిచేశాం. ఉచిత ప్రసాదంతో పాటు విక్రయాలకు లడ్డూ తయారీ చేయిస్తున్నాం. ఆలయ పరిధిలో విధుల నిర్వహణకు 100 మంది సిబ్బందిని నియమించాలని నిర్ణయించాం.

70 వేల లడ్డూల తయారీ :
వనంగుడి, చదురుగుడి ఆలయాల వద్ద ఉచిత దర్శనం, ప్రత్యేకం - రూ.20, శీఘ్ర- రూ.100, కేశ ఖండనకు రూ.40 ధరలు నిర్ణయించాం. అమ్మవారి దర్శనం అనంతరం గుడి నుంచి బయటకు వచ్చే భక్తులకు ఉచిత ప్రసాదం అందిస్తాం. పులిహోర 150 గ్రాములు రూ.10, లడ్డూ 80 గ్రాములు రూ.15 ఇవ్వనున్నాం. మొదటి వారంలో సుమారు 30 వేల వరకు లడ్డూలను సిద్ధం చేస్తున్నాం. మిగిలిన తొమ్మిది వారాలకు మరో 40 వేలు తయారు చేస్తాం.

వృద్ధులు, చిన్నారులపై దృష్టి :
ఆలయాల్లో పోలీసుల సహకారంతో గర్భిణులు, వృద్ధులు, చిన్నారులకు ప్రత్యేక దర్శనం జరిగేలా చర్యలు తీసుకోనున్నాం. స్వచ్ఛంద సంస్థల సేవకుల ఆధ్వర్యంలో క్యూలైన్ల వద్ద మంచినీరు, చిన్నారులకు పాలు, ఇతర సౌకర్యాలు కల్పిస్తాం. నదిలో మహిళలు స్నానాల అనంతరం దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నాం. ఆలయాలకు విద్యుత్తు దీపాలంకరణ చేపట్టాం. తాత్కాలిక ట్రాన్స్ ఫార్మర్లు, 41సిసి కెమెరాలు పెట్టించాం. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నాలుగు చోట్ల శిబిరాలునిర్వహిస్తామని తెలిపారు.

ఆలయాభివృద్ధికి కృషి :
ఈవోగా బాధ్యతలు చేపట్టిన నుంచి ఆలయ అభివృద్ధికి ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులతో చర్చించి రూ.50 లక్షలు మంజూరు చేయించాం. భక్తుల విశ్రాంతికిషెడ్ల నిర్మాణం, క్యూలైన్ల ప్రాంతాల్లో శాశ్వత షెడ్ల ఏర్పాటుకు ప్రతిపాదించాం. ముఖద్వారం, సులభ్ కాంప్లెక్సులు, గోముఖి నదీ తీరాన రక్షణ గోడ, అన్నదాన మండపం, సిరిమాను తిరిగే వీధుల్లో రోడ్డు విస్తరణ, ఆలయ సమీపంలో పార్క్ మొదలైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని నివేదించాం. ప్రస్తుతం జడ్పీ నిధులతో ఆర్వో ప్లాంటుకు రూ. 5 లక్షలు వచ్చాయి. ప్లాంట్ గదికి మరో రూ. 5 లక్షలు అవసరం. శంబరలో ఉన్న వసతిగృహం, వనంగుడి సమీపంలో ఎకరం పొలం దేవస్థానానికి అప్పగించాలని కోరాం. జిల్లాల్లోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ జాతర ప్రశాంతంగా జరిగేందుకు జిల్లాల్లోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే తగు అదేశాలు జారీ చేశారని, వారి ఆదేశాలు, సూచనలు, సలహాల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్తానిక అధికారులు, కమిటీ సభ్యులు తెలిపారు. జాతరపై ఇప్పటికే పార్వతీపురం ఆర్డీఓ హేమలత పర్యవేక్షణ అధికారిగా డివిజన్ పరిధిలోని సమావేశాన్ని ఏర్పాటుచేసి అందరి అధికారుల సమన్వయంతో విజయవంతం చేసే ందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జాతరకు ఆర్టీసీ బస్సులు పెద్ద ఎత్తున వేయడం జరిగిందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. పెద్ద ఎత్తున వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు ఎక్కడికక్కడ ఉచిత వైద్య శిబిరాలు, మందులు ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టరు ఎం జగన్నాధ రావు తెలిపారు. పారిశుధ్యం నివారణ, మరుగుదొడ్లు ఏర్పాటు, మంచి నీటి సౌకర్యంకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లాపంచాయతీ, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు తెలిపారు.పార్వతీపురం మన్యం జిల్లాలోని అతిపెద్ద జాతరగా పిలవబడే పోలమాంబ జాతర ప్రశాంతంగా జరిగేందుకు జిల్లాల్లోని అన్ని శాఖల అధికారులు, పోలమాంబ కమిటీ సభ్యులు, మక్కువ, సాలురు మండల అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

ఆతవలో వేడుకగా శ్రీవేమాలమ్మ వారి తీర్థమహోత్సవం

- అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

- ఆకట్టుకున్న బుర్రకథ, డాన్స్ బేబీ డాన్స్ ప్రదర్శనలు

విశాలాంధ్ర - వేపాడ : మండలంలోని ఆతవ గ్రామస్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న శ్రీ వేమాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం వేడుకగా జరుపుకున్నారు. గ్రామ పెద్దలు ప్రజలు ఐక మత్యంతో జరుపుకున్న ఈ తీర్థ మహోత్సవంలో భాగంగా వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించు కుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గ్రామస్తులు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్న ఈ తీర్థ మహోత్సవంలో చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి ఇతర ప్రాంతాల నుంచి చుట్టాలు స్నేహితులు బంధువులు అధికసంఖ్యలో తరలివచ్చి ఆనందంగా గడిపారు. అలాగే రాత్రి 7గంటల నుంచి గ్రామంలో బుర్రకథ, డాన్స్ బేబీ డాన్స్ ప్రదర్శనలు అందరినీ అలరించేలా ప్రదర్శించారు. గ్రామ సర్పంచ్ గొంపవేమన రాము, సిరికి రమణ, నాగిరెడ్డి జగన్, ఎం లక్ష్మణరావు, ఇతర గ్రామ పెద్దల సారధ్యంలో తీర్థ మహోత్సవం ఘనంగా జరిపారు. అలాగే మండలంలోని అరిగిపాలెంలో శ్రీ చుక్కమాంబ రెండవ రోజు తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన డాన్స్ బేబీ డాన్స్ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

వైసీపీ ప్రభుత్వం ఇంటికెళ్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

నెల్లిమర్ల నియోజకవర్గం టీడీపీ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు

విశాలాంధ్ర పూసపాటిరేగ : ఆదివారం పూసపాటిరేగ మండలం పూసపాటిపాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ నేలిమర్ల ఇన్చార్జి కర్రోతు బంగార్రాజు మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో రాష్ట్ర ఆదాయం పెరగలేదు. ఉద్యోగాలు రాలేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక బాదుడే బాదుడు.సంక్రాంతి కానుక, క్రిస్ మస్ గిఫ్ట్, రంజాన్ తోఫా ఏమయ్యాయి?. తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు నాణ్యమైన మద్యం సరఫరా చేశాం. వైసీపీ ప్రభుత్వం వచ్చాక నాసిరకం మద్యం వచ్చింది జగన్.. మందుబాబులను కూడా మోసం చేశారు.మద్య నిషేధం చేశాకే ఓటు అడుగుతానని జగన్ చెప్పారు.ఈ ప్రభుత్వంలో ఆర్టీసీ ఛార్జీలు పెంచారు.కరెంట్ ఛార్జీలు పెంచారు. చెత్తపై పన్ను వేసిన చెత్త ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో నిలిచారు.ఈ సమావేశంలో డెంకడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్ రావు, భోగాపురం మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ,జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు రౌతు సోమినాయుడు , క్లస్టర్ ఇంఛార్జిలు అట్టాడ శ్రీధర్, దాసరి అప్పలస్వామి, పిడుగు తోటరావు, టిడిపి సీనియర్ నాయకులు కోరాడ తాతారావు తదితరులు పాల్గొన్నారు.